పార్కు ప్రారంభం ఎప్పుడు?

- రూ.50లక్షలతో నిర్మాణం
- ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పార్కు

మహబూబాబాద్: లక్షల రూపాయలతో పార్కు నిర్మాణం చేపట్టారు. కాని ప్రారంభోత్సవంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రారంభోత్సవం కోసం ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతంలో నిర్మించిన వాటి కంటే విభిన్నంగా పార్కు నిర్మాణం చేశారు. కలెక్టరేట్ వెళ్లే దారిలో దీన్ని నిర్మించారు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉండగా 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. విద్యా, వ్యాపారం, ఉద్యోగ రీత్యా మానుకోటలో నివాసం ఉండే వారితో కల్పితే లక్ష జనాభా టుతుంది. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయలతో 6పార్కుల నిర్మాణం చేశారు. దానిలో బటర్‌ఫ్లై పార్కు ప్రత్యేక ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. గ్రీన్ ల్యాండ్‌ల పరిరక్షణలో భాగంగా వాటి నిర్మాణాలు చేపట్టారు.పార్కులో వాకింగ్ ట్రాక్‌తోపాటు కొన్నింటిలో ఓపెన్ జిమ్‌లు కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఆకర్షణీయంగా..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే కంబాల చెరువు పక్కనే సుమారు 12గుంటల భూమిలో నూకల రామచంద్రారెడ్డి స్మారకార్థం పార్కు నిర్మాణం చేపట్టారు. పట్టణ ప్రగతితోపాటు పలు గ్రాంట్ల నిధుల నుంచి సుమారు రూ.50లక్షల వ్యయంతో నిర్మించారు. పాంటీస్, గ్రానైట్‌తో పలు నిర్మాణాలతోపాటు, టైల్స్ ఇతరత్రా వాటితో అందంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలు పార్కు ఎప్పుడు ప్రారంభోత్సవం చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. పిల్లలతో కలిసి వెళ్లి ఆడుకోవాలని వారి ఆసక్తి చూపుతున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే వారికి కూడా దానిలో కొంత సేపు గడిపే అవకాశం ఉంటుంది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్: పేదలు నివాసముంటున్న ఇళ్లకు విద్యుత్ మీటర్లు, కొత్త స్తంభాలను వేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గల విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో ఎదుట మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల నివారణకు మిడిల్ పోల్స్, కొత్త లైన్లు, కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీల్లో గల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఏడీఈ ప్రశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెరుకు కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, వెలుగు శ్రావణ్, అశోక్, ప్రవీణ్, పద్మ, పాల్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులతో రోడ్డు నిర్మాణం


ఉపాధి కూలీలతో ఎంపీడీఓ వివేకరం

దంతాలపల్లి: మండల కేంద్రం పరిధిలో ఉపాధి హామీ పనులతో మట్టి రోడ్డు చేపడుతున్నట్లు ఎంపీడీఓ వివేకరం తెలిపారు. మంగళవారం ఉపాధి కూలీలు నిర్వహిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల శివారు నుంచి రైతులు తమ చేనుల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.3.50లక్షల వ్యయంతో ఒక కిలోమీటర్ వరకు మట్టి రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు పనులు పూర్తి అయితే రైతులకు తమ చేనుల వద్దకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మార్క వెంకన్న, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, యూత్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు యువత కీలక పాత్ర పోషించిందని, వచ్చే ఎన్నికల్లో యువతకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. అర్హులైన వారికి రాజీవ్ యువ వికాసం పథకంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న యుగేందర్‌రెడ్డి

మరిపెడ రూరల్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అబ్బాయిపాలెం బీసీ కాలనీలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో పలు సీసీ రోడ్లను మంజూరయ్యాయి. ఇట్టి సీసీ రోడ్ల నిర్మాణాలను మంగళవారం యుగేందర్‌రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ ఏఈ అజయ్, కార్యదర్శి బొమ్మరెడ్డి శ్రీలక్ష్మీ, పీఏసీఎస్ డైరెక్టర్ ఏకస్వామి ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, మాజీ ఎంపీటీసీ బుజ్జిబద్యా, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వం ఆదుకోవాలి

బయ్యారం: ఇటీవల కురిసిన రాళ్లవానతో మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, భిక్షం, మురళీ, వెంకన్న, నర్సింహా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ చెల్లించాలి

మహబూబాబాద్: సమగ్ర ఇంటింటి సర్వే చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా ముఖ్య గణాంక అధికారి కె.విజయలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బొల్లం శ్రీనివాస్, ఉపేందర్ , విద్యాసాగర్, విజయరాజ్, రమేశ్ పాల్గొన్నారు.

సంత వేలం రూ.21లక్షలు

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం వారాంతపు సంతకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. కమిషనర్ ప్రసన్నరాణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఇట్టి వేలంపాటలో 6గురు పాటదారులు పాల్గొనగా, కేసముద్రంస్టేషన్‌కి చెందిన బట్టు శ్రీనివాస్ అనే వ్యక్తి రూ.21,15,000లకు సంతను వేలంలో దక్కించుకున్నట్లు ఆర్‌ఓ ఎల్.కుమార్ తెలిపారు.

పోగొట్టుకున్న మిర్చి బస్తాల అప్పగింత

కురవి: పోగొట్టుకున్న మిర్చి బస్తాలను పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ బాధిత రైతుకు మంగళవారం అప్పగించి మానవత్వం చాటుకున్నాడు. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన రైతు సుఖారా వెంకటేశ్వర్లు అనే రైతు సోమవారం రాత్రి మూడు మిర్చి బస్తాలను తీసుకుని మానుకోట మార్కెట్‌కు తరలిస్తుండగా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామం వద్ద కిందపడిపోయాయి. ఈక్రమంలో బయ్యారం నుంచి బైక్‌పై బానోత్ దేవేందర్ బంచరాయి తండాకు వస్తున్నాడు. బ్రిడ్జి వద్ద మూడు మిర్చి బస్తాలు పడి ఉండడంతో వెంటనే కురవి పోలీసులకు సమాచారం అందించాడు. బస్తాలను తిరిగి రైతుకు అప్పగించిన దేవేందర్‌తోపాటు కానిస్టేబుల్ రమేశ్‌ను తండావాసులు అభినందించారు.

ఘనంగా ధ్వజారోహణ పూజలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో జరుగుతున్న శ్రీవేంటేశ్వర స్వామివారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజ, చక్ర, గరుడ పూజలు నిర్వహించి, ధ్వజారోహణ పూజలు జరిపి భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని మూలమర్రితండా గ్రామ పంచాయతీలోని తోప్లతండాకు చెందిన తేజావత్ శ్రీధర్‌కుమార్ బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఎన్ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చదువులో ఎంతో చురుకుగా ఉండే శ్రీధర్ కుమార్‌ను గుర్తించిన ఐటీడీఏ జేడీ కొండలరావు గిరిపు సంక్షేమం తరపున రూ.80వేల ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఇట్టి ల్యాప్‌టాప్‌ను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.

వెలగని సోలార్ లైట్



గార్ల: గార్ల పట్టణంలో ఎల్లప్పుడు రద్దీగా ఉండే మెయిన్ బజారులో రాత్రి సోలార్ లైట్ వెలగక పోవడంతో మెయిన్ బజారు అంధకారంలో ఉంటుంది. దీంతో రాత్రి సమయంలో మెయిన్ బజారులో గల దుకాణాలకు నిత్యావసర సరుకులకు వచ్చే ప్రజలు వెలుతురు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

వేబ్రిడ్జి కొనుగోళ్లతో నష్టపోతున్న హమాలీలు


వినతిపత్రం ఇస్తున్న హమాలీలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బయట నిబంధనలకు విరుద్ధంగా, వేబ్రిడ్జి ద్వారా రైతుల సరుకులను కొనుగోళ్లు చేస్తుండడంతో మార్కెట్‌లో పనిచేసే బండి హమాలీలకు నష్టం వాటిల్లుతుందని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావుకు బండి హమాలీలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వేబ్రిడ్జి ద్వారా కొనుగోలు చేసిన సరుకులలో బస్తాకు రూ.638లను చెల్లించే విధంగా మార్కెట్ పాలకమండలి, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా కోశాధికారి బొల్లోజు రామ్మోహనాచారి, సామ వెంకన్న, ఆంగోతు బిల్యా, సామ ప్రభాకర్‌రెడ్డి, బానోత్ కిషన్, సామ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, కరుణాకర్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోట దగ్ధం

కురవి: మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పామాయిల్ తోట మంగళవారం దగ్ధమైంది. బాధిత రైతు హేమరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మొగిలిచర్ల గ్రామానికి చెందిన నంద్యాల హేమరాజు అనే రైతుకు చెందిన 13ఎకరాల్లో రెండున్నర ఏళ్ల కిందట పామాయిల్ తోటను సాగు చేస్తున్నాడు. మధ్యాహ్నం గుట్టల వద్ద మీదుగా వచ్చిన నిప్పు రవ్వలు తోటలో పడి అంటుకున్నాయి. దీంతో తోటలోని 20 చెట్లు కాలిపోయాయి. అందులోని డ్రిప్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

వ్యాపారులకు నోటీసుల జారీ

డోర్నకల్: డ్రెయినేజీని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుతోపాటు పలు ముఖ్య వీధుల్లో వ్యాపారులు, గృహ యజమానులు డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు చేసి వారికి రూ.5వేల నుంచి రూ.10,000 వరకు జరిమానా విధిస్తూ దుకాణం సీజ్ చేస్తామన్నారు. నోటీసులు అందిన మూడు రోజుల్లోగా డ్రెయినేజీలపై వ్యాపారాలను తొలగించాలని నోటీసులో మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.

మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌ల్లో రాణించాలి


విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న హెచ్‌ఎం

డోర్నకల్: విద్యార్థులు మాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌ల్లో రాణించాలని డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహరావు కోరారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం 8, 9వ తరగతి విద్యార్థులకు 'ఇంటరాక్షన్ విత్ యంగ్ సైంటిస్ట్ అండ్ మ్యాథమెటిషియన్' పేరుతో నిర్వమించిన సదస్సులో హెచ్‌ఎం మాట్లాడుతూ.. మాథ్స్, సైన్స్‌పై ఆసక్తి చూపించే విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారు భవిష్యత్‌లో సైంటిస్టులుగా ఎదిగేందుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 9వ తరగతి విద్యార్థిని జాస్మిన్‌కు సర్టిఫికెట్ అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమీనా, వసంతరాణి, సాహెబ్‌అలీ, అప్పిరెడ్డి, శంకరయ్య, మంజులత పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి


అవగాహన కల్పిస్తున్న డీఈ మధుసూదన్

చిన్నగూడూరు: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తొర్రూరు డీఈ మధుసూదన్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నగూడూరు సెక్షన్ పరిధిలోని పంట పొలాల వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. రైతులు బావుల వద్ద ఉన్న మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. గృహ అవసరాలు, వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సమస్య ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ జహూర్ పాషా, ఏఈ నవ్య, విద్యుత్ సిబ్బంది క్రాంతి, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

'అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు'


మాట్లాడుతున్న పాయం చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్: అకాల వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షం, రాళ్లవాన, గాలి బీభత్సంతో పంటలు దెబ్బతిన్నాయని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. మిర్చి, మొక్కజొన్న, వరి, పత్తితో పాటు ఇతర పంటలు ధ్వంసమయ్యాయని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు ఆదుకునేందుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ముల్కూరు జగ్గన్న, పూనెం ప్రభాకర్, పైండ్ల యాకయ్య, పల్లెల పాపారావు పాల్గొన్నారు.

దాడులు చేయడం సరికాదు

తొర్రూరు: న్యాయవాదులపై తరచూ దాడులు చేయడం సరికాదని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఘనపురం రామకృష్ణ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని సివిల్ కోర్టు ఎదుట న్యాయవాది ఇజ్రాయిల్‌ను హత్యకు నిరసనగా బార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్, ముకుందారావు, యాకాంబ్రం, రఘురామ్‌రెడ్డి, అలోని, లాలు, భాస్కర్ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి పూజలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో కొలువైఉన్న బంగారు మైసమ్మ తల్లి ఆలయం వద్ద గంగ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిందురెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భాగంగా ఒగ్గు కళాకారులు, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఒగ్గు కళాకారులు రమేష్, వెంకటేష్, నరేష్, కిషన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

గంగారం: మార్చి 27న మోకాళ్లపల్లి గ్రామంలో ఆదివాసీ లిబరేషన్ టైగెర్స్ వ్యవస్థాపక కార్యదర్శి కుంజ రాము వర్ధంతిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం కోరారు. మంగళశారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగారం తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పెనక వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి కల్తి రమేష్, దొరపటేళ్ల సంఘం అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

నెల్లికుదురు: హర్యానా రాష్ట్ర ఆచార సంస్కృతిని ప్రతిబింబించేలా సంప్రదాయ పోటీల్లో విద్యార్థినులు ఆకట్టుకున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

నిరంతర విద్యుత్ అందించాలి

నర్సింహులపేట: విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని సీఈ రాజేష్ చౌహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దనాగారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ మదుసూధన్, ఏఈ పాండు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన బత్తెం శ్రీను కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న తోటి మిత్రులు రూ.10వేలు నగదు ఆర్థికసాయం మిత్రుడికి అందజేశారు.

టిప్పర్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభాలు

డోర్నకల్: సీరోలు మండలం సంకీస క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



కురవి: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కురవి, మోద్గుల గూడెం, నల్లెల్ల, నారాయణపురం, మొగిలిచర్ల తదితర గ్రామాల్లో ఒక్క సారిగా ఉరుములు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈసమయంలోనే తండాకు చెందిన భూక్య మల్సూర్‌కు చెందిన పాడి ఆవు మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న తీగలకు ఆవు తగలడంతో విదుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి ఆవు విలువ రూ.50వేలు ఉంటుందని రైతు మల్సూర్ కుటుంబసభ్యులు బోరున విలపిస్తూ తెలిపారు

మేచరాజుపల్లిలో..

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామ పరిధిలోని మసీదు ప్రాంతలో కోటగిరి కిరణ్‌కు చెందిన పాడిగేదె మంగళవారం మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగకు తగలగానే గేదె మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేములపల్లి గ్రామంలో పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

బయ్యారం: మండలంలోని బీరోనిమడవ గ్రామంలో రాళ్లవానతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి బానోత్ రాంజీ మంగళవారం పరిశీలించారు.

బైండోవర్ ఉల్లంఘన.. రూ.50వేల జరిమానా

తొర్రూరు: గుడుంబా దాడుల్లో పట్టుబడిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎక్సైజ్ సీఐ రాజేశుని ప్రవీణ్ తెలిపారు. మంగళవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సారా విక్రయిస్తూ బైండోవర్ ఉల్లంఘించిన కేసులో తొర్రూరుకు చెందిన బొమ్మనబోయిన వెంకన్నను ఖమ్మం జైలుకు తరలించినట్లు తెలిపారు. తొర్రూరు దుబ్బతండాకు చెందిన యాకుబ్, పెద్ద వంగర మండలం వంపుతండాకు చెందిన ధరావత్ శ్రీను బైండ్‌వర్‌ను ఉల్లంఘించినందుకు రూ.50వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో నేడు బుధవారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు తెలిపారు.

అర్హులకు అందని 'రైతుభరోసా'

మరిపెడ: రబీ సీజన్ పూర్తవుతున్నా నేటి వరకు రైతులకు రైతుభరోసా పూర్తిస్థాయిలో అందలేదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మరిపెడలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయలైన సంఘటన మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.. స్థానికుల కథనం ప్రకారం హన్మకొండకు చెందిన బి. రాజేష్ అనే వ్యక్తి తొర్రూరు నుంచి బస్సు చార్జీలకు డబ్బులు లేక నాంచారీమడూరులోని తన బంధువుల ఇంటికి కాలినడకన ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. రాయపర్తి మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన శోభన్‌బాబు అనే వ్యక్తి బైక్‌పై తొర్రూరు నుంచి స్వగ్రామానికి వెళ్తూ ఢీకొట్టగా రాజేష్ కాలు విరగింది. కిందపడిన శోభన్‌బాబు తలకు తీవ్రగాయాలు కావడంతో 108వాహనంలో తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

యూనిఫాం అందజేత

గార్ల: గార్ల మండల క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ యూనిఫాం దుస్తులకు పీఏసీఎస్ చైర్మన్ వడ్ల మూడి దుర్గాప్రసాద్ మంగళవారం అందజేశారు. యాకూబ్‌పాషా, బాబూలాల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మద్యం మత్తులో అస్వస్థతతో వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్: తరుచూ మద్యం తాగుతూ ఓ వ్యక్తి అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని సోమారపుకుంటతండా శివారులో మంగళవారం చేటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరు మండలంలోని చీకటాయాపాలెం గ్రామానికి చెందిన పాండవుల యాకయ్య(34) అనే వ్యక్తి కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తన అక్క స్వగ్రామమైన నెల్లికుదురు మండలంలోని బ్రహ్మణకొత్తపల్లికి సోమవారం వెళ్లి, తిరిగి మంగళవారం ఉదయం మరోసారి మద్యం తాగి కాలినడకన నడుచుకుంటూ తొర్రూరు వైపు వస్తుండగా ఆహారం, తాగునీరు లేకపోవడంతో ఓపిక లేక అస్వస్థతకు గురై రోడ్డు పక్కననే పడిపోయి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. గొర్రెలు మృతి

గూడూరు: టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పిన ట్రాలీ ఆటో పల్టీ కొట్టడంతో నాలుగు గొర్రెలు మృతిచెందిన సంఘటన మండలంలోని జగన్నాయకులగూడెం శివారు మానుకోట వైపు జాతీయ రహదారి వద్ద మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం మానుకోట సమీప సాలార్ తండాకు చెందిన బానోతు సదర్‌లాల్ గొర్రెల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మానుకోటకు చెందిన మాలోతు మల్సూర్‌కు ట్రాలీ ఆటోలో గొర్రెలను తరలిస్తున్నాడు. జాతీయ రహదారి చింతలగట్టు సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు చేరుకోగా, టైర్ పంచర్ అయి ఆటో అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న నాలుగు గొర్రెలు మృతిచెందగా, వ్యాపారి సదర్‌లాల్‌కు కాలు విరిగింది, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మానుకోట ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

కేసముద్రం: ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ముగ్గురు మహిళలకు గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరికి వెళ్లే దారిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం పెద్దకొర్పోలు గ్రామానికి చెందిన వారు, ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలోని ఓ కార్యానికి వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రం నుంచి వెంకటగిరికి వెళ్లే దారిలోని ఓ మలుపు వద్ద ఆటో అదుపుతప్పడంతో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మట్టి మరియమ్మ, బిర్రు సుగుణ, మేఘనలకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్సై చేరుకొని గాయపడిన వారిని 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన ఎర్పుల శ్రీను(35) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న శ్రీను రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. సోమవారం మండలంలోని పడమటిగూడెంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. నిత్యం మద్యం తాగుతు అనారోగ్యానికి గురైన శ్రీను సోమవారం రాత్రి తన ఇంటికి చేరి, ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు.

రూ.100 కోట్లు కేటాయించడంపై హర్షం


మంత్రులను కలిసిన బ్రాహ్మణ ప్రతినిధులు

తొర్రూరు: బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.100కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ బ్రాహ్మణ అఫిషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బోప్వా రాష్ట్ర అధ్యక్షుడు బీవీ సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, పీవి రామచంద్రరావు, సీతారామయ్య, రాంబాబు, శ్రీనివాస శర్మ, సంతోష్‌కుమార్ శాస్త్రీ, అలహరి శ్యాంసుదర్ పాల్గొన్నారు.